# మన చౌరాస్తా

తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 128 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | శనివారం, 04 ఏప్రిల్ 2026 | పేజీలు : 4


## శ్రీలీల చిక్కాలు

4లో





### తెలంగాణ సాయుధ పోరాటాలకు

## స్ఫూర్తి దొడ్డి కొమ్మురయ్య

**దొడ్డి కొమురయ్య తెలంగాణ తొలి విప్లవ వీరుడు అని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. శుక్రవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయం లో బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన దొడ్డి కొమరయ్య జయంతి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పాల్గొని, ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.**

3లో

### స్కూల్ ఫీజుల నియంత్రణ

## చట్టం చేయాలి

- **ఆనాడు మాట్లాడిని రేవంత్ ఇప్పుడు మాట్లాడడం లేదు**
- **టీఆర్ఎస్ పేరు ఖాళీగా ఉంది.. ఎవరైనా వాడుకోవచ్చు**
- **జాగృతి అధ్యక్షురాలు కవిత సంచలన వ్యాఖ్యలు**



**హైదరాబాద్, మన చౌరాస్తా :** రాష్ట్రంలో స్కూల్ ఫీజుల గొడవ నడుస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో 39,640 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. వీటిలో 12,061 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయన్నారు. సీబీఎస్సీ సెంట్రల్ సిలబస్ ఉన్న స్కూల్స్లో 25 నుంచి 30 శాతం ఫీజులు పెంచి ఇప్పటినుంచే వసూలు చేస్తున్నారన్నారు. బీఆరఎస్ ఉన్నప్పుడు ఫీజు నియంత్రణ చట్టం చేయాలని రేవంత్ రెడ్డి పదే పదే మాట్లాడారని గుర్తుచేశారు. ఎవరెంత తిన్నారంటూ అసెంబ్లీలో చర్చ చేసుకున్నారే తప్ప ఫీజుల నియంత్రణపై మాట్లాడలేదని విమర్శించారు. ప్రత్యేక అసెంబ్లీ నిర్వహించి ఫీజు నియంత్రణ చట్టం వెంటనే తేవాలని కవిత డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలన్నారు. ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు ఫీజులను పెంచుతున్నాయే తప్ప టీచర్లకు మాత్రం జీతాలు పెంచరని విమర్శించారు. ప్రైవేట్ కాలేజీల్లో ఆహార నాణ్యతను ప్రభుత్వం పట్టించుకోదా అని ప్రశ్నించారు. ప్రైవేట్ పాఠశాలలు, ఆసుపత్రులను సీఎం ప్రారంభిస్తున్నారని... వాళ్ళ దోపిడిని ఎంకరేజ్ చేస్తున్నారా అంటూ నిలదీశారు. ప్రైవేట్ స్కూల్స్ దోపిడీని కంట్రోల్ చేయాలని ప్రభుత్వాన్ని కవిత డిమాండ్ చేశారు. ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే స్కూల్స్ ముందు ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. 'అన్ని శాఖలకు ముఖ్యమంత్రే మంత్రిగా ఉండటం మన కర్మ' అంటూ వ్యాఖ్యలు చేశారు. బీఆరఎస్ హయాంలో తనను నిజామాబాద్కు పరిమితం చేశారని అన్నారు. ఆంధ్రా, నార్త్ ఇండియా వాళ్ళు ఇక్కడ విద్యా సంస్థలు నెలకొల్పినా తెలంగాణ వాళ్ళకే అవకాశం ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు.అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్న స్కూల్ యాజమాన్యాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. తక్షణమే ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని.. అధిక ఫీజుల వసూళ్లను కట్టడి చేయాలని కోరారు.తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పాత పేరు, కొత్త అజెండాతో ప్రజల ముందుకు వస్తానని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) పేరు ఫ్రీ అయిందని.. ఇప్పుడు దాన్ని ఎవరైనా వాడుకోవచ్చన్నారు. ఆచార్య జయశంకర్ సిద్ధాంతాల ప్రకారమే తమ పార్టీ నడుస్తుందని చెప్పారు. తమ పార్టీకి బిహార్ సిద్ధాంతకర్త అంటూ ఎవరూ లేరన్నారు. బీఆర్ఎస్ ప్రస్తుతం నిద్రావస్థలో ఉందని విమర్శించారు.




# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

**అదిలాబాద్ -కలెక్టర్ రాజర్షి షా**



**అదిలాబాద్, మన చౌరాస్తా :** తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ (టీ.ఎస్.జె.యు) జిల్లా నూతనంగా ఎన్నుకోబడిన కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ సమావేశ కార్యాలయం లో కలెక్టర్ రాజర్షి షా నీ మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నూతనంగా ఎన్నుకొబడిన జిల్లా అధ్యక్షుడు రాగం సుభాష్ ,ప్రధాన కార్యదర్శి మేడపట్ల సాయన్న, ఉపాధ్యక్షులు పసుపుల స్వామి లకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు జర్నలిస్టు లు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఇందులో ప్రధానంగా అర్హులైన జర్నలిస్టుల అందరికీ అక్రిడేషన్ కార్డులను మంజూరు చేయడం తోపాటు హెల్త్ కార్డులు అన్నిప్రైవేటు ఆసుపత్రులలో చెల్లుబాటు అయ్యేవిధంగా చూడాలని, అర్హులైన జర్నలిస్టుల అందరికీ ఇల్లు,ఇంటి స్థలాలు ఇవ్వవలసిందిగా కోరారు.దీనిలో భాగంగా జర్నలిస్టులపై దాడులు జరుగుతున్న సందర్భంలో అటాక్స్ కమిటీని జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసి రక్షణ కల్పించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.దీనిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతామని వీటిని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తాను అని బరోసా ఇచ్చారు. యూనియన్ కోశాధికారి అమృత్, ఓకే ప్రచార కార్యదర్శి మిలింద్, యూనియన్ గౌరవ అధ్యక్షులు నరేష్ కదం, సహాయ కార్యదర్శి ఆర్క సంతోష్‌తో పాటు మిగతా సభ్యులు దీపక్ ఎముర్లవార్, అనిల్ పవర్, అడ్డిగం మోహన్, శంకర్ తదితరులు ఉన్నారు.

# ప్రజల దృష్టి మరల్చేందుకే వార్డు, గ్రామసభలు

**బీఆర్ఎస్ పట్టణ యూత్ అధ్యక్షుడు ఉల్లెంగుల సందీప్**



**జనగామ, మన చౌరాస్తా :** ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం దాని నుండి ప్రజల దృష్టిని మరల్చేందుకే గ్రామసభల పేరుతో కొత్త నాటకానికి తెర లేపిందని బీఆర్ఎస్ జనగామ పట్టణ యూత్ ప్రెసిడెంట్ ఉల్లెంగుల సందీప్ అన్నారు. ప్రజల నుండి పలుమార్లు దరఖాస్తులు తీసుకోవడం తప్ప ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు. ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క హామీని కూడా పూర్తిగా నెరవేర్చ లేదని ఆయన విమర్శించారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటిన మహిళలకు 2500, తులం బంగారం, కొత్త పింఛన్ల ఊసే ఎత్తడం లేదని, రైతు భరోసా కూడా మూడు సార్లు ఎగవేశారని , పింఛన్లు పెంచకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలు అమలు చేయాలని సందీప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# విద్య శక్తివంతమైన ఆయుధం

**జనగామ, మన చౌరాస్తా :** విద్యార్థులు క్రమ శిక్షణతో చదువుకొని, తల్లిదండ్రుల కలలను తీర్చాలని పాఠశాల ప్రిన్సిపాల్ నిమ్మ రాంరెడ్డి అన్నారు. జనగామ పబ్లిక్ స్కూల్‌లో జరిగిన 4వ వార్షికోత్సవ వేడుకకు ఆయన అధ్యక్షత వహించగా ఎంఈవో శంకర్ రెడ్డి ముఖ్యఅతిథిగా జి.శంకర్ రెడ్డి మాట్లాడుతూ విద్యాభివృద్ధి సరిగ్గా జరగాలంటే విద్యార్థులను ఎప్పటికప్పుడు వారి నడవడికా ధోరణిని సవరిస్తూ, ప్రతి రోజు ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలను రాయించి, చదివించే బాధ్యత తల్లిదండ్రుల మీద ఉందన్నారు. పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ మడికొండ యాదగిరి మాట్లాడుతూ ఉన్నత శిఖరాలను చేరుకోవాలంటే విద్యార్థులు విలువలతో కూడిన విద్య ను అభ్యసిస్త , విద్యార్థు లందరూ మనో వాక్కాయములను, తన ఆధీనంలో ఉంచుకొని నిరంతరం సాధన చేస్తే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చన్నారు. కార్యక్రమంలో పాఠశాల భవన యజమాని మహంకాళి నటరాజ్, రిటైర్డ్ టీచర్ మోకురాంరెడ్డి, 10వ వార్డు కౌన్సిలర్ నిరటి రజిని పాల్గొన్నారు. కార్యక్రమంలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకర్షించాయి.



# కొత్తపల్లిలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** కొత్తపల్లి గ్రామంలో పేదల సొంత ఇంటి కల సాకారం అవుతుందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం గ్రామానికి చెందిన సట్ల వీరస్వామి, వరమ్మల ఇందిరమ్మ ఇంటిని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. రెండో విడతలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు మంజూరు అయ్యేలా కృషి చేస్తామని చెప్పారు. ఇందిరమ్మ ఇల్లు లభించడంతో తమ కల నెరవేరిందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. ఎనిమిదో వార్డులో తొలి ఇందిరమ్మ ఇల్లు ప్రారంభం కావడం సంతోషకరమని వార్డు సభ్యుడు నడిగోటి నరేష్ తెలిపారు. ఈ సందర్భంగా సట్ల వీరస్వామి, వరమ్మ దంపతులను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సాయి నగర్ గ్రామ సర్పంచ్ మేకల వెంకన్నతో పాటు పత్తిపాక కొమురెల్లి, శిఖ ప్రభాకర్, బాబు, సురేష్,



ప్రశాంత్, ఐలయ్య, సదానందం, వీరన్న, నరేష్, రాజేష్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.



# యువతలో రాజకీయ 'పవనాలు'

యువత రాజకీయాల్లోకి రావాలని, పాలితులుగా ఉండకుండా పాలకులుగా వారు ఎదగాలని ప్రతీ ఒక్కరూ ఆకాంక్షిస్తారు. కానీ, ఆచరణలో ఆ దిశగా యూత్‌ను చైతన్య పరిచి రాజకీయ రంగంలో వారు ముందుకు సాగేలా ప్రోత్సహించే వారు కొద్ది మందే. ముఖ్యంగా యువతలో రాజకీయ చైతన్యం నింపుతూ.. తమదైన గమ్యం చేరుకునేలా ప్రోత్సాహం అందించడం కీలకం. ఆ దిశగా వారి అడుగులు పడేలా ప్రముఖ సినీనటుడు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తన వంతు ప్రోత్సాహం

ఇస్తున్నారని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. తన జనసేన పార్టీలో యువతకు ప్రాధాన్యమిస్తున్నారు. సంప్రదాయ రాజకీయ పార్టీలకు ఉండే భావజాలానికి భిన్నంగా తన పార్టీలో జనసైనికులకు తమదైన పంథాలో ప్రయాణం కొనసాగించేలా దిశానిర్దేశం చేస్తున్నారు. ఫలితంగా యువతలో రాజకీయ చైతన్యం పెరుగుతున్నది. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలలో పొలిటికల్‌గా జర్నీ చేయాలని యువతీ యువకులు నడుం బిగుస్తున్నారని చెప్పొచ్చు. జనసేన పార్టీలో జనసైనికులుగా తమ రాజకీయాన్ని షురూ చేయాలనే యువత పెద్ద ఎత్తున ఆసక్తి చూపుతున్నది.

## విలక్షణశైలి పవన్ సొంతం

అధికార వికేంద్రీకరణ, పర్యావరణ పరిరక్షణ, సుపరిపాలన వంటి అంశాలతో పాటు దేశభక్తి గురించి నినదించే నాయకుడిగా పవన్ పేరు సంపాదించుకున్నారు. ముఖ్యంగా యువత అభిమానించే లీడర్‌గా పవన్ ఎమర్జ్ అయ్యారు. భారతదేశంలోనే కాదు ప్రపంచవ్యాప్తంగానూ ఆయన సినీ నటుడిగా ఫుల్ ఫేమస్. గూగుల్‌లో ఆయన గురించి నెటిజన్లు ఎక్కువగా సెర్చ్ చేయడంతో గూగుల్ పాపులర్ పర్సన్‌గా యాక్టర్స్ కేటగిరీలో రికార్డుకెక్కారు. ఇక దేశంలో.. తెలుగు రాష్ట్రాలలోనే కాదు ఆ మాటకొస్తే.. దక్షిణాదియే కాదు.. యావత్ భారతదేశంలోనూ ఆయనకు పలుకుబడి ఉంది. దేశ ప్రధాని నరేంద్ర మోడీ చెప్పినట్లు ఆయనకొక 'తుఫాను'లాగా ముందుకెళ్లగలరు. హండ్రెడ్ పర్సెంట్ స్ట్రైక్ రేట్ తో దేశరాజకీయాల్లో ఆయన చరిత్ర సృష్టించారు.

## దేశభక్తికి మారుపేరు

'అంత కలిపి నేను పిడికెడు మట్టే కావచ్చు. కానీ నేను ఒకసారి తలెత్తి చూస్తే ఒక దేశపు జెండాకు ఉన్నంత పొగరుంది' అంటూ అశేష అభిమానులను ఉద్దేశించి పవన్ చెప్పే మాటలు ప్రతీ ఒక్కరిలో ఉత్సాహాన్ని , దేశభక్తినిన ◌ారిపోస్తాయి. ముఖ్యంగా యువతను ఉద్దేశించి.. 'కలలు కను' అంటూ గుంటూరు శేషేంద్ర శర్మ, బాలగంగాధర్ తిలక్ కవితలను ఉటంకిస్తూ..భావోద్వేగంతో పవన్ చెప్పే మాటల యువతను ఉత్తేజితం చేస్తున్నాయి. ప్రస్తుతం పాలనాపరంగా డిప్యూటీ సీఎంగా సేవలందిస్తూనే.. నటనాపరంగానూ కుదిరినంతలో సినిమాలు చేస్తూ.. ఒకే సమయంలో నటుడిగానూ, నాయకుడిగానూ.. జోడు గుర్రాల మీద స్వారీ చేస్తూ.. ప్రజల్లో ఉన్నారు. జనసేన అధినేతగా ఉన్న పవన్ కల్యాణ్.. ప్రధాన మంత్రి నరేంద్రమోడీకి అత్యంత ఆత్మీయుడిగా ఉన్నారు. ఆయన భవిష్యత్తులో దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించే అవకాశాలు మెండుగానే కనిపిస్తున్నాయి. ఆయన

తనను తాను తెలుగు రాష్ట్రాలకే పరిమితం చేసుకోకుండా దక్షిణ భారతదేశంతో పాటు ఉత్తర భారతంలోని వివిధ అంశాలపైన మాట్లాడటం చూస్తుంటే.. యువతలో రాజకీయ చైతన్యం కలిగించేలా.. వారికి జనసేనను ఒక రాజకీయ వేదికగా అందించేందుకు గేట్లు తెరిచే ఉంచినట్లు స్పష్టమౌతున్నది. ఇక దక్షిణ భారతాన అయితే ఇప్పటికే పలువురు సినీ నటులు వెండితెరను వదిలి రాజకీయ రణరంగాన సంచలనాలు సృష్టించారు. ఆ కోవకు చెందిన నాయకుడిగా పవన్ కల్యాణ్ నిలిచారు. అయితే, పవన్ తనదైన శైలిలో స్వయం ప్రకాశితుడిగా, పడి లేచిన కెరటం లా రాజకీయ రంగంలో ముందుకు సాగుతున్నారు. ఆయన భాషలోనే మరో మాటలో చెప్పాలంటే.. 'ఎక్కడ నెగ్గాలో కాదు..ఎక్కడ తగ్గాలో తెలిసిన వాడు గొప్పవాడు' అనే సినీ డైలాగ్‌ను రియల్ లైఫ్‌లోనూ పవన్ ఫాలో అవుతున్నట్లున్నారు. యువత రాజకీయాల్లోకి రావాలని అందులో.. బలమైన భావజాలం, సిద్ధాంతం, దేశం పట్ల ప్రేమతో, దేశభక్తితో కూడిన పార్టీగా ఉన్న జనసేనలోకి యువత పెద్ద ఎత్తున రావాలని.. నవ భారత నిర్మాణానికి అడుగులు పడాలని ఆశిస్తున్నా.



**- లింగబత్తిని కృష్ణ, జర్నలిస్ట్,**
**సెల్ : 9701923260.**



# వైన్ షాపుల ముందు అడ్డదిడ్డంగా పార్కింగ్

**హుస్నాబాద్, మన చౌరాస్తా :** సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న వైన్స్ షాపుల వద్ద నెలకొన్న సమస్యలు రోజురోజుకీ తీవ్రమవుతున్నాయి. వాహనాల అస్తవ్యస్త పార్కింగ్, పర్మిట్ రూముల అపరిశుభ్రత, అధికారుల నిర్లక్ష్యం మొత్తం కలిసి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ఈ పరిస్థితి స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

## రహదారిపై అడ్డంగా..

జాతీయ రహదారి పక్కనే ఉన్న వైన్స్ షాపుల ముందు వినియోగదారులు వాహనాలను ఎక్కడ పడితే అక్కడ నిలిపివేస్తున్నారు. దీంతో రహదారిపై ట్రాఫిక్ అంతరాయం కలిగి, తరచూ ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయి. భారీ వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉండే ఈ మార్గంలో ఇటువంటి పరిస్థితులు ప్రమాదాలకు దారితీసే అవకాశాలు పెంచుతున్నాయి.

## యజమానుల నిర్లక్ష్యం..

వైన్స్ షాపుల యజమానులు తమ అమ్మకాలపై మాత్రమే దృష్టి సారిస్తూ, షాపుల ముందు పార్కింగ్ నియంత్రణపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కస్టమర్లకు పార్కింగ్ మార్గదర్శకాలు ఇవ్వకపోవడం, సెక్యూరిటీ ఏర్పాటు చేయకపోవడం పరిస్థితిని మరింత దిగజారుస్తోంది.

## కంపు కొడుతున్న పర్మిట్ రూములు

వైన్స్ షాపులకు అనుబంధంగా ఉన్న పర్మిట్ రూములు పరిశుభ్రత లేకుండా ఉండటం వల్ల దుర్వాసనలు వ్యాపిస్తున్నాయి. ఆహార పదార్థాల నిల్వ, తయారీ విధానాల్లో నాణ్యత లోపం కనిపిస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇవి ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదం ఉంది.

## శాఖల మధ్య సమన్వయ లోపం..

ఈ సమస్యల పరిష్కారంలో వివిధ శాఖల మధ్య సమన్వయం లేకపోవడం ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ట్రాఫిక్ పోలీసులు, ఎక్సైజ్ శాఖ, మున్సిపల్ అధికారులు, ఫుడ్ సేఫ్టీ విభాగం ఇవన్నీ తమ తమ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించడంలో విఫలమవుతున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.




## ప్రజల ఆగ్రహం..

స్థానిక యువజన సంఘాలు, ప్రజా ప్రతినిధులు ఈ పరిస్థితిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రహదారి భద్రత, పరిశుభ్రత పరిరక్షణ కోసం తక్షణ చర్యలు తీసుకోవాలని, వైన్స్ షాపుల యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. హుస్నాబాద్‌లో వైన్స్ షాపుల వద్ద నెలకొన్న ఈ సమస్యలు కేవలం స్థానిక సమస్యగా కాకుండా ప్రజా భద్రత, ఆరోగ్యానికి సంబంధించిన అంశంగా మారాయి. సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో వ్యవహరించి, సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం అత్యవసరంగా ఉంది.

# రాజీవ్ యువ వికాస్ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

- **డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ధర్మబిక్షం**

**జనగామ, మన చౌరాస్తా :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దరఖాస్తులకే పరిమితం చేస్తుందే తప్ప అమలుకు నోచుకోవడం లేదని డీవైఎఫ్ఐ జనగామ జిల్లా అధ్యక్షులు ధర్మబిక్షం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి రుణాలు అందించాడానికై రాజీవ్ యువ వికాస్ పథకం ద్వారా రూ. 50 వేల నుండి రూ.4 లక్షల వరకు రుణాలను ఇస్తామని 6 వేల కోట్ల రూపాయలను కేటాయించింది. ఈ పథకానికి రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగులు 16 లక్షల 27వేల మంది వరకు దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం 2025 జూన్ 2 తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజున రాజీవ్ యువ వికాస్ పతకం లబ్దిదారులకు నిధులను మంజూరు చేస్తామని ప్రచారం చేసి, వాయిదా వేసింది. రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా, కాలయాపన చేయకుండా రాజకీయ ప్రమేయం లేకుండా అర్హులైన లబ్దిదారుల అందరికి రాజీవ్ యువ వికాస్ పథకం ద్వారా నిధులు మంజూరు చేయాలని అన్నారు.సిబిల్ స్కోరు లేకున్నా నిరుద్యోగ యువతకు ఈ పథకాన్ని అమలు చేయాలన్ని అన్నారు. లేనిచో జిల్లా వ్యాప్తంగా ఎమ్మెల్యేల కార్యాలయాలను ముట్టడిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నిరుద్యోగులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కోరారు.

# నేడే మహిళా చైతన్య సదస్సు

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా మహనీయుల జీవిత చరిత్రపై అవగాహన పెంపొందించేందుకు హుస్నాబాద్ నియోజకవర్గంలో మహిళా చైతన్య సదస్సు నిర్వహించనున్నారు. ఈ సదస్సు నేడు హుస్నాబాద్‌లోని కేజేఆర్ ఫంక్షన్ హాల్‌లో జరుగుతుందని జేఏసీ చైర్మన్ డ్యాగల సారయ్య తెలిపారు. నియోజకవర్గంలోని ఏడు మండలాల పరిధిలోని అన్ని గ్రామాల నుండి మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఐకెపి మహిళా సంఘాల సభ్యులు, అంగన్వాడీ టీచర్లకు వ్యాస రచన పోటీలు నిర్వహించగా, ప్రతి గ్రామానికి ప్రథమ, ద్వితీయ బహుమతులు ప్రదానం చేయనున్నారు. ఈ బహుమతులను మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా అందజేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా రిటైర్డ్ ప్రొఫెసర్ కాత్యాయన విద్మహే ఆధ్వర్యంలో "నేటి సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్లు - పాలకుల పాత్ర" అనే అంశంపై ప్రత్యేక సెమినార్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మహిళల సాధికారత, సమాజంలో వారి పాత్రపై అవగాహన పెంపొందించడమే ఈ సదస్సు ముఖ్య ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు.



# డీబీఎం–40 కాలువపే పరిశీలించి వరంగల్ కలెక్టర్

**వరంగల్, మన చౌరాస్తా :** ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా, ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో నర్సంపేట మండలం లక్నపల్లి గ్రామం వద్ద శుభ్రపరిచిన డిబీఎం-40 కాలువను జిల్లా కలెక్టర్ డా. సత్య శారద శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కాలువ శుభ్రపరిచే పనుల పురోగతిని, నీటి ప్రవాహ పరిస్థితిని కలెక్టర్ సమీక్షించారు. కాలువల ద్వారా రైతులకు సమయానికి నీరు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే, కాలువల నిర్వహణను నిరంతరం పర్యవేక్షిస్తూ ఎక్కడైనా అడ్డంకులు ఉంటే వెంటనే తొలగించాలని ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికతో పనులు నిర్వహించాలని, సాగునీటి సరఫరాలో లోపాలు రాకుండా చూడాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో నర్సంపేట ఆర్డీఓ ఉమారాణి, ఇరిగేషన్ ఈ ఈ సుదర్శన్, ఈ ఈ ch సునీత, జిల్లా ఇరిగేషన్ అధికారి ప్రశాంతి, డి ఈ సంతోష్, సంబంధిత ఏ ఇ తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ సాయుధ పోరాటాలకు స్ఫూర్తి దొడ్డి కొమ్మురయ్య

**జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**జనగామ, మన చౌరాస్తా :** దొడ్డి కొమురయ్య తెలంగాణ తొలి విప్లవ వీరుడు అని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. శుక్రవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయం లో బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన దొడ్డి కొమరయ్య జయంతి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పాల్గొని, ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... భూమి, భూక్తి, విముక్తి కోసం ప్రజల్లో స్ఫూర్తి నింపారని అన్నారు. సాయుధ పోరాటంలో కొమురయ్య వీర మరణం పొందడంతో గ్రామల్లోని ప్రజల్లో చైతన్యం కలిగి, తెలంగాణ ఉద్యమాలకు నిజాం పాలనపై పోరాటాలు కొనసాగించడానికి స్ఫూర్తిగా దొడ్డి కొమురయ్య నిలిచారన్నారు . అనంతరం జిల్లా లోని వివిధ బిసి సంఘాల నాయకులు దొడ్డి కొమురమ్య చిత్రపటానికి పూలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో DBCDO ఎం.లక్ష్మీనర్సింహారావు, ABCDO రవీందర్, జిల్లాలోని వివిధ




కుల సంఘాల నాయకులు డి. మల్లికాంబ, జె. మల్లేష్, కె. రమేష్, యస్. అంజనేయులు, వి. చక్రపాణి, యం. సాంబయ్య, పి. హరీష్, బి. వెంకయ్య మల్లయ్య, యన్. కుమారస్వామి, సిహెచ్. వీరస్వామి, గోప ఫండర్ జిల్లా అధ్యక్షులు కె. పరుశరాములు, మేకల సమ్మయ్య, ఎం కృష్ణమూర్తి ,డి సిద్దయ్య గౌడ్ , యం.శ్రీనివాస్, కె. మధుసుధన్, ఎన్. సోమయ్య, బి. సిద్దలు, వివిధ BC కుల సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీలీల..
# చిట్కాలు..

పాత్రలో లీనమవడం ఎంత ముఖ్యమో, దానినుంచి బయటకు రావడం కూడా అంతే ముఖ్యం. షూటింగ్ ఒత్తిడి నుంచి బయటపడటానికి నేను కొన్ని చిన్నచిన్న అలవాట్లను చేసుకున్నాను. సంగీతం వినడం, కాసేపు ఒంటరిగా గడపడం, కుటుంబసభ్యులతో వీడియో కాల్‌లో మాట్లాడటం వంటివి నాకు ఉపశమనాన్ని ఇస్తాయని నటి శ్రీలీల తన అనుభవాలను పంచుకున్నారు. ఫ్రెండ్స్‌తో చిట్‌చాట్ చేయడం నాకు రిలీఫ్‌గా ఉంటుంది. నేను పని ఒత్తిడిని ఇంటికి తీసుకెళ్లకూడదని ప్రయత్నిస్తాను. ఒకవేళ పొరపాటున అలా జరిగినా, పైన చెప్పిన చిన్న చిన్న పద్ధతులు నన్ను మళ్లీ మామూలు స్థితికి తీసుకువస్తాయి. కొన్నిసార్లు పరిస్థితులకు అనుగుణంగా మనల్ని మనం సర్దుబాటు చేసుకుంటూ ముందుకుసాగడమే ఏకైక మార్గం అని శ్రీలీల తెలిపారు. ప్రస్తుతం శ్రీలీల కోలీవుడ్‌లో బిజీగా మారింది. 'పరాశక్తి'తో తమిళనాట అడుగుపెట్టిన ఆమె ధనుష్‌తో కలిసి 'డీ55' (వర్కింగ్ టైటిల్)లో నటిస్తోంది. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో ఇది రానుంది. దీనితో పాటు అనురాగ్ బసు దర్శకత్వంలో బాలీవుడ్ ఎంట్రీకి కూడా శ్రీలీల సిద్ధమవుతున్నారు.



Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**